పూట గడిచేదెలా..?

- ఇసుక కొరతతో పనుల్లేక పస్తులు
- ఈసురోమంటున్న భవన నిర్మాణ కార్మికులు
- ఇంటి అద్దె, పిల్లల పోషణ భారంగా మారిందని ఆవేదన



ఇసుకతోట జంక్షన్‌లో పనుల కోసం ఎదురు చూస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మద్దిలపాలెం: ఉచిత ఇసుక అంటూ ఎన్నికల ముందు హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించింది. ఉచిత ఇసుక ఇవ్వకపోగా కొరత సృష్టించి భవన నిర్మాణ కార్మికుల నోట్లో మట్టి కొట్టింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఉచిత ఇసుక ఊసే లేదు. అసలు కొందామంటే ఇసుక దొరకని పరిస్థితి. దీంతో వందల సంఖ్యలో భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. అధిక ధరకు బ్లాక్‌లో ఇసుక కొనుక్కోవలసిన దుస్థితి ఏర్పడింది. మరికొంత మంది ఒడిశా రాష్ట్రం నుంచి ఇసుక తెప్పించుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టన్ను ఇసుక సుమారు రూ.900కు లభించగా.. ప్రస్తుతం టన్నుకు రూ.2 వేలు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తూర్పు నియోజకవర్గంలో 70 శాతం భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరక్క ఆకలితో అలమటిస్తున్నారు. పూట గడిచేదెలాగంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు అన్ని రోజులు పని..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తూర్పు నియోజకవర్గంలోని ప్రతి వార్డులో పదుల సంఖ్యలో భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులు జరిగేవి. కార్మికులకు వారంలో ఏడు రోజులు పని దొరికేది. మరోపక్క సంక్షేమ పథకాలు అండగా నిలిచేవి. దీంతో ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సంతోషంగా రోజులు గడిచేవని కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు.

నేడు పనులు గగనం..

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులకు పనిదొరకడమే గగనంగా మారింది. ఉదయాన్నే చద్దన్నం తిని 8 గంటలు క్యారేజీ పట్టుకుని పని కోసం రోడ్డుకొచ్చి నిల్చుంటున్నారు. పని దొరికితే వెళ్లడం లేదంటే తెచ్చిన క్యారేజీ తినేసి ఇంటిదారి పడుతున్నారు. వారానికి రెండు రోజులు పని దొరకడం కష్టంగా ఉందని భవన నిర్మాణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి బతుకు దెరువు కోసం వలస వచ్చామని, మూడు నెలలుగా పని సరిగ్గా దొరకడం లేదని కూలీలు వాపోతున్నారు. ఒకపక్క ఇంటి అద్దె, పిల్లల పోషణ, చదువు.. మరోపక్క పెరిగిన నిత్యావసర సరకుల ధరలు భారంగా మారాయంటున్నారు.

మూడు నెలలుగా ఆర్థిక ఇబ్బందులు..

ప్రస్తుతం భవన నిర్మాణ యజమానులు శ్రీకాకుళం నుంచి బ్లాక్‌లో ఇసుక తెప్పిస్తున్నారు. లేదంటే ఒడిశా నుంచి కొంటున్నారు. ప్రస్తుతం టన్ను ఇసుక కోసం రూ.2 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. 18 టన్నుల ఇసుక లారీ అన్ని రకాల చార్జీలతో కలిపి నగరానికి చేరడానికి సుమారు రూ.36 వేలు ఖర్చవుతోంది. తూర్పు నియోజకవర్గంలోని హెచ్‌బీ కాలనీ, దుర్గానగర్, హనుమంతవాక, ఆరిలోవ, మంగాపురం కాలనీ, పీతవానిపాలెం, శివాజీపాలెం, మద్దిలపాలెం, వెంకోజీపాలెం, జాలరిపేట తదితర ప్రాంతాల్లో సుమారు 3 వేల మంది భవన నిర్మాణ కార్మికులు నివసిస్తున్నారు. ఇసుక కొరతతో మూడు నెలలుగా పనులు లేక వీరంతా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు తమ గోడు పట్టించుకోవాలని కోరుతున్నారు.

వారానికి రెండు రోజులే పని



శ్రీకాకుళం నుంచి వలస వచ్చాం. కుటుంబంతో కలిసి రామాటాకీస్ వద్ద వినాయక నగర్‌లో ఉంటున్నాం. తాపీ మేస్త్రీ పని చేస్తుంటాను. నా వద్ద పది మంది కూలీలు ఉన్నారు. ఇసుక దొరక్క మూడు నెలలుగా పనులు లేవు. వారానికి ఒకటి రెండు రోజులే పని దొరుకుతోంది. మిగతా రోజులు ఖాళీగా ఉంటున్నాం. పనుల్లేక అప్పులు చేయాల్సి వస్తోంది. – జమ్ము రాము, వినాయక నగర్

ఎలా బతికేది..?



ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు సీతంపేట కూలికి వస్తాను. పని కోసం 10 గంటల వరకు ఎదురు చూస్తాను. ఆగిన ప్రతి బండి వద్దకు పరిగెడతాను. పని దొరికితే సరి. లేదంటే ఇంటిముఖం పట్టాల్సిందే. నాలా ఇక్కడ వంద మంది వరకు పని కోసం వస్తుంటారు. ఇంటి అద్దె కూడా చెల్లించలేక పోతున్నాం. పెరిగిన ధరలతో పూట గడవడం కష్టంగా ఉంది. – డి.ఆదినారాయణ, మంగాపురం కాలనీ

పనులు దొరకడం లేదు



గతంలో వారానికి ఏడు రోజులు పనిదొరికేది. మూడు నెలలుగా పనులు దొరకడం లేదు. ఇసుక దొరక్క, ఎక్కువ ధరకు కొనలేక చాలా వరకు పనులు ఆగిపోయాయి. దీంతో మాలాంటి వారికి కూలి పనిలేక ఇల్లు గడవటం కష్టంగా మారింది. దసరా, దీపావళి పండగలు కూడా సంతోషంగా చేసుకోలేకపోయాం. ప్రభుత్వం చొరవ తీసుకుని రోజూ పనిదొరికేలా చూడాలి. – వై.అప్పలరెడ్డి, హనుమంతవాక

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: విమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

బాలలు సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

ఆరిలోవ: బాలలు నేరాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. దీన్‌దయాల్‌పురం వద్ద ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో ఈ నెల 14 నుంచి జరిగిన బాలల హక్కుల వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. గృహం పర్యవేక్షణాధికారి కె.వీరయ్య ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. బాలురు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి నేర సంఘటనల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా గాని పాల్గొనకూడదని సూచించారు. అనంతరం బాలురకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో రాష్ట్ర చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ సభ్యుడు గొండు సీతారాం, ఐసీఐసీఐ బ్యాంక్ విశ్రాంతి మేనేజర్ మణిమాల, రోటరీ క్లబ్ డైరెక్టర్ డాక్టర్ సుగణ, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యుడు సూర్య భాస్కరరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు వినయ్ గాంధీ, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని సద్గురు షిర్డీసాయిబాబా మందిర 28వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బాబాకు విశేష పూజలు, పంచామృతాభిషేకం, అఖండ హారతి నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. వారికి వివిధ రకాల ప్రసాదాలను మందిర కమిటీ ప్రతినిధులు పంపిణీ చేశారు.

వేడుకగా సత్యసాయి సేవా దినోత్సవం



పేదలకు దుస్తులు అందిస్తున్న సత్యసాయి సేవా సంస్థల సభ్యులు

ఎంవీపీకాలనీ: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం సేవా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీపీ కాలనీలోని లెబన్‌హిల్స్ దివ్యాంగుల పాఠశాల విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. వారికి సత్యసాయి విభూది, చిత్రపటాలను పంపిణీ చేశారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-8లోని ప్రేమసదన్‌లో పేదలకు దుస్తుల పంపిణీ, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లపై నిరాశ్రయులకు దుప్పట్లు అందించారు. సమితి గాయకులచే సాయంత్రం ఏర్పాటు చేసిన సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. సత్యసాయి సేవా సమితి, శ్రీ సత్యసాయి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లల ఆసక్తికి అనుగుణంగా విద్యా బోధన



బాలుడికి పుస్తకం అందజేస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ: పిల్లలకు అవసరమైన విద్య బోధించాలని బాలుర గృహంలోని ఉపాధ్యాయులకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. దీన్‌దయాల్‌పురం ప్రభుత్వ బాలుర వసతి గృహంలో బుధవారం నిర్వహించిన బాలల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. బాలలు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. గృహంలో ఉపాధ్యాయులు పిల్లలు ఎందులో ప్రావీణ్యం చూపుతున్నారో గుర్తించాలని, వారికి ఆసక్తి గల అంశాల గురించి వివరించాలన్నారు. అనంతరం బాలురకు ప్రముఖుల జీవిత చరిత్రతో కూడిన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ రామలక్ష్మి, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, బాలుర గృహం పర్యవేక్షణాధికారి రమణ, ప్రజాహిత బ్రహ్మకుమారి రామేశ్వరి, సీడబ్ల్యూసీ సభ్యులు సూర్యనారాయణ, విజయలక్ష్మి, రాధ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం నేడు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 21వ తేదీ గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగే ఈ స్వచ్ఛందంగా పాల్గొన్ని రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఏయూ లైబ్రరీలో ఇన్‌ఫ్లిబినెట్ సేవలు



శాస్త్రవేత్త అభిషేక్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇన్‌ఫ్లిబినెట్ సేవలను పూర్తిస్థాయిలో విద్యార్థులకు, పరిశోధనలకు అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా ఏయూ అధికారులు ముందడుగు వేశారు. బుధవారం ఏయూకు విచ్చేసిన ఇన్‌ఫ్లిబినెట్ శాస్త్రవేత్త అభిషేక్ కుమార్ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇన్‌ఫ్లిబినెట్ అందిస్తున్న సేవలను అభిషేక్ వివరించారు. త్వరలో ఇన్‌ఫ్లిబినెట్‌తో అవగాహన ఒప్పందం చేసుకోవాలని ఏయూ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. దీనికి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని గ్రంథాలయ అధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లుకు సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఉద్యోగులు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. దీనికి సంబంధించి అసెంబ్లీలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చేశామన్నారు. ఈ సందర్భంగా బుధవారం మద్దిలపాలెం రామ్మోహన్ భవన్‌లో శ్రీనివాసరావును ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు అక్రమంగా ఇస్తున్న పనిష్మెంట్ల మీద, ఆర్టీసీలో గతంలో ఉండే పరిమితి లేని వైద్య సౌకర్యం గురించి, కొత్త బస్సుల కోసం, అన్ని పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ పెన్షన్ కోసం కృషి చేయాలని ప్రజాప్రతినిధులందరినీ కోరినట్లు తెలిపారు. దీనిలో భాగంగా శాసనసభా పక్ష నేతగా అసెంబ్లీలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.నీలకంఠం జి.రామకృష్ణ జిల్లా చైర్మన్ ప్రాన్ డివిజన్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, రీజినల్ జాయింట్ సెక్రటరీ కె.ఎస్.ఎన్.మూర్తి, అన్ని డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రంగనాథన్ సేవలు చిరస్మరణీయం



ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జగదీశ్వరరావు, విద్యార్థులు

ఎంవీపీకాలనీ: గ్రంథాలయ పితామహుడు ఎస్‌ఆర్ రంగనాథన్‌కు వీఎంసీ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ దేశంలోని గ్రంథాలయాల అభివృద్ధికి రంగనాథన్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయను ఆలోచనల్లో భాగంగా ఏర్పడిన గ్రంథాలయాలు నేటికి యువతకు విజ్ఞానాన్ని పంచుతున్నాయన్నారు. కళాశాల లైబ్రేరియన్ పి.రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ ఎంవీపీ కాలనీ సమత కాలేజీలో ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్రపటం వద్ద కళాశాల డైరెక్టర్ జి.శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ పార్క్‌లో నూతన హంగులు



బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్క్‌లో నూతన హంగులు సమకూరుస్తున్నారు. పర్యాటకులను, చిన్నారులను ఆకట్టుకునేలా కొత్తగా ఏనుగు బొమ్మలు సిద్ధమవుతున్నాయి. పార్క్ ప్రవేశ మార్గానికి ఎదురుగా ఉండే విశాలమైన మైదానంలో రెండు పెద్ద ఏనుగులు, ఒక చిన్న ఏనుగు బొమ్మలను ఏర్పాటు చేస్తున్నారు. – ఏయూక్యాంపస్

కాలువలో పూడిక తొలగింపు



ఇందిరానగర్ ప్రధాన కాలువలో పూడిక తొలగిస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వెనుక వీధి ప్రధాన కాలువలో పూడికను పారిశుధ్య కార్మికులు తొలగించారు. ఈ కాలువలో పూడిక నిండి స్థానికులు దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై 'కాలువలో పేరుకుపోతున్న వ్యర్థాలు' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో వెలువడిన వార్తకు జోన్-2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ స్పందించారు. ఇందిరాగనర్ కాలువను శుభ్రం చేయించాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంటనే సిబ్బందితో అక్కడ కాలువలో పూడిక తొలగించి శుభ్రం చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సందడిగా మహిళల క్రిస్మస్



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

బీచ్‌రోడ్డు: సిరిపురంలోని ఆశ్రయ్ మినిస్ట్రీస్‌లో బుధవారం మహిళల క్రిస్మస్ వేడుకలు సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రయ్ మినిస్ట్రీస్ కో ఫౌండర్ డాక్టర్ జి.ఎం.బీట్రీస్ మనోహర్ కేక్ కట్‌చేసి కాండిల్ లైట్ వెలిగించారు. ప్రజలు తమ జీవితంలో ఏసుక్రీస్తు అనే వెలుగును వెలిగించుకోవాలని పిలుపునిచ్చారు. చీకటిమయమైన ప్రజల జీవితంలో జీసస్ ఒక వెలుగుగా జన్మించారన్నారు. అనంతరం సంఘ మహిళలను ఘనంగా సత్కరించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు



సర్టిఫికెట్ అందిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు



ముగింపు సభలో కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

విశాఖ విద్య: గ్రంథాలయాలంటే కేవలం పుస్తకాలే కాదని, ఒక జ్ఞాన కేంద్రంగా నిలుస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. ప్లాటినం జూబ్లీ సమావేశం హాల్లో బుధవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. గ్రంథాలయానికి గూగుల్ ప్రత్యామ్నాయం కాదని, ఆన్‌లైన్‌లో చదవడం వల్ల కేవలం 30 శాతం సమాచారం మాత్రమే గ్రహించగలమన్నారు. పుస్తకాలు చదివితే 70 శాతం వరకు జ్ఞానాన్ని గ్రహించగలమని సూచించారు. ప్రస్తుతం గ్రంథాలయంలో విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. శోధ్ గంగాలో ఏయూ గ్రంథాలయం ఆరో స్థానంలో నిలవడంపై అభినందించారు. గ్రంథాలయ అభివద్ధికి, తాలపత్రాల డిజిటలైజేషన్‌కి కృషి చేసిన ఆచార్య వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు. గత వారం రోజులుగా నిర్వహించిన కార్యక్రమాల వివరాలను ఆచార్య వెంకటేశ్వర్లు వివరించారు. ఇన్‌ఫ్లిబినెట్ శాస్త్రవేత్త అభిషేక్ కుమార్ వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయ వారోత్సవాల సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాశస్త్యం, ప్రస్తుత సమాజంలో దాని అవసరం కోసం విద్యార్థులకు వివరించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ బి.మోహన వెంకటరామ్ మాట్లాడుతూ పుస్తక పఠన గొప్పతనం, ప్రయోజనాలు, వ్యక్తిత్వ వికాసానికి గ్రంథాలయాలు ఏవిదంగా ఉపయోగపడతాయో తెలియజేశారు. వారం రోజుల్లో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు, గ్రంథాలయ విభాగాధిపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న అతిథులు

ఎంవీపీకాలనీ: సెక్టార్-7లోని ఎంవీపీ కాలనీ శాఖ గ్రంథాలయంలో బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను కార్పొరేటర్ మంగవేణి అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలను వినియోగించుకోవడం ద్వారా విద్యార్థులు సంపూర్ణ విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంవీపీ గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్ని కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహం పాల్గొన్నారన్నారు. వీటికి సహకరించిన స్కూల్ యాజమాన్యాలు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. 50 మంది విజేతలకు బహుమతులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైశ్యరాజు జ్యువెలర్స్ అధినేత నరేష్‌రాజు, కేబీఆర్ ఈవెంట్స్ ప్రతినిధి కె.బాబురావు, సామాజిక కార్యకర్త సత్యకుమార్, రచయిత సుసర్ల సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియానికి గ్రహణం

- వైఎస్సార్‌సీపీ హయాంలో కైలాసగిరిపై శ్రీకారం
- కూటమి ప్రభుత్వంలో ఆగిన నిర్మాణం



కైలాసగిరిపై పునాదుల దశలో నిలిచిపోయిన సైన్స్ మ్యూజియం నిర్మాణ పనులు

ఆరిలోవ: నగరానికే తలమానికంగా నిలిచిన పర్యాటక కేంద్రం కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ చేపట్టిన సైన్స్ మ్యూజియం నిర్మాణానికి ఆరంభంలోనే ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ నిర్మాణం పునాదుల వరకే జరిగి ఆగిపోయింది. రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం కలిసి మ్యూజియం గ్రాంట్ స్కీం కింద సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఎస్‌సీఏపీ) ఆధ్వర్యంలో ఇక్కడ ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ఏర్పాటు చేయదలచాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 2న అప్పటి ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నాటి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వీఎంఆర్‌డీఏ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు ఎకరం విస్తీర్ణం గల స్థలంలో మ్యూజియం నిర్మాణానికి రూ.4.69 కోట్ల నిధులు కేటాయించారు. పనులు చకచకా చేపట్టారు. సుమారు నాలుగు నెలల్లో స్థలం చదును చేయించి పునాదులు, ప్లాట్‌ఫారం నిర్మించారు. అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో అప్పటివరకు జరిగిన మ్యూజియం పనులకు బ్రేక్ పడింది.

అందని ద్రాక్షేనా..!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సైన్స్ మ్యూజియం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో గ్రహణం పట్టింది. అధికారులు దీని పనులు నిలిపేశారు. మ్యూజియం నిర్మాణం పూర్తయితే 3డీ ఆర్ట్ గ్యాలరీ, సిలికా విగ్రహాలు, సైన్స్ వర్కింగ్ సైన్స్ వర్కింగ్ మోడల్ ప్రదర్శనలు, శాస్త్రీయ థీమ్‌లు పర్యాటకులకు అందుబాటులో ఉండాల్సింది. కూటమి ప్రభుత్వంలో ఈ పనులు ఆగిపోయాయి. దీంతో ఇక్కడ సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. పర్యాటకులకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని పంచాల్సిన ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ మ్యూజియం అందని ద్రాక్షలా మిగిలిపోతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు ఏయూలో 'అమెరికా అల్లుడు' నాటిక ప్రదర్శన

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలోని కేవీ గోపాలస్వామి ఆరు బయలు రంగస్థలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం రంగస్థల విభాగం ఆధ్వర్యంలో అమెరికా అల్లుడు హాస్యనాటిక ప్రదర్శిస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో ప్రదర్శించే ఈ నాటికను నగరవాసులందరూ హాజరై తిలకించాలని కోరారు. కార్యక్రమంలో ముందుగా కె.చంద్రరావు వేణుగానం, ఎం.వి.సుబ్రహ్మణ్యం హాస్య వల్లరి నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.